క్లుప్తంగా

ఔదార్యం..



రాయలలో లక్ష్మికి నిత్యావసరాలు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కొత్తూరు: కొత్తూరుకు చెందిన భగత్‌సింగ్ చారటబుల్ ట్రస్టు సభ్యులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని రాయల గ్రామానికి చెందిన నిరుపేదరాలు పెద్దింటి లక్ష్మి క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆమెకు మూడు నెలలకు సరిపడే నిత్యవసర సరుకులను మంగళవారం అందజేశారు. మహర్తాపురం గ్రామానికి చెందిన పొన్నాడ వెంకటరావు పక్షవాతంతో బాధపడుతున్నారు. ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు అందించారు. దాతలు, ట్రస్టు సభ్యులు సమకూర్చిన విరాళాలను ప్రతీ నెల మొదటి ఆదివారం ఆపదలో ఉన్న వారికి అందజేస్తున్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



తాత్రాజు, వివిధ వేషధారణలు

కొత్తూరు: మండలంలోని సిరుసువాడలో మంగళవారం తాత్రాజు వీధి నాటకాన్ని గ్రామస్తులు ప్రదర్శించారు. గౌరీపౌర్ణమి ముగింపు ఉత్సవాల అనంతరం గ్రామంలో ప్రతీ ఏడాది తాత్రాజు నాటకం ప్రదర్శడం ఆనవాయితీ. ఈ సంవత్సరం కూడా తాత్రాజు నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి ఒకరు ఈ నాటకంలో ఏదో ఒక పాత్రలో నటిస్తారు. బురదరాజు ప్రదర్శన ఆకట్టుకుంది. తాత్రాజు పాత్రలో గ్రామానికి చెందిన చెంగల శ్రీనివాసరావు నటించారు.

'అపార్' పూర్తి చేయండి



అపార్ అప్డేషన్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ శాంతారావు

నరసన్నపేట: ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థులకు సంబంధించిన అపార్‌ను తొందరగా పూర్తిచేయాలని ఎంఈఓ శాంతారావు సూచించారు. స్థానిక పెద్దపేటలోని రవీంద్రభారతి స్కూల్‌ను మంగళవారం పరిశీలించారు. అపార్ డేటా అప్లోడ్‌పై సమీక్ష చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరో వారం రోజుల్లో అపార్ పూర్తి చేయాలన్నారు.

వెలవెలబోయిన భూ రీసర్వే సదస్సు



ఖాళీగా ఉన్న కుర్చీలు

బూర్జ: మండలంలోని డొంకలపర్త గ్రామంలో మంగళవారం నిర్వహించిన భూ రీ సర్వే అవగాహన సదస్సు వెలవెలబోయింది. మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రామస్తులు ఎవరూ రాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

హిరమండలం: పచ్చిరొట్ట ఎరువులు, పెంట గెత్తం ఉపయోగిస్తూ పంటలు పండించడం ద్వారా దిగుబడులతో అధిక ఆదాయం పొందవచ్చునని వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు అన్నారు. స్థానిక మండల మహిళా సమైఖ్య సమావేశ మందిరంలో రైతు ఉత్పత్తుదారుల సంఘాల మహిళా సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్యం బాగుంటుందని సూచించారు. ప్రతీ కుటుంబం జామ, బొప్పాయి, అరటి తదితర పోషక విలువలు కలిగిన పంటలతోపాటు ఆకుకూరలు, కూరగాయలు పండించడం ద్వారా లబ్ధి పొందవచ్చునన్నారు. మండల సమైక్య ప్రతినిధులు సరస్వతి, ప్రభావతి, అకౌంటెంట్ బేబీ పాణిగ్రహి, డేటా ఆపరేటర్ ప్రసాద్, క్లస్టర్ కోఆర్డినేటర్ అప్పలస్వామి, అసిరయ్య, సుజాత, విజయ, వీఓఏలు పాల్గొన్నారు.

రాయితీపై అపరాల విత్తనాలు

ఎల్.ఎన్.పేట: రబీ సీజన్‌లో ఆరుతడిగా వేసుకునే అపరాల పంటలైన మినుము, పెసర విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని ఏఓ పైడి లతశ్రీ మంగళవారం తెలిపారు. అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద పెసర, మినుము విత్తనాలు నాలుగు కిలోల ప్యాకెట్లలో లభిస్తున్నాయన్నారు. ప్రభుత్వ రాయితీ పోను నాలుగు కిలోల మినుము విత్తనాల ధర రూ.392, పెసర విత్తనాల ధర రూ.364 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు కావలసిన రైతులు వారికి సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

అమ్మకానికి సిద్ధంగా..

హిరమండలం: పెసర, మినుము విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు ఏఓ బి.సంధ్య మంగళవారం తెలిపారు. పీయూ–31 రకం మినుము విత్తనాలు 20 క్వింటాళ్లు, విరాట్ రకం పెసర విత్తనాలు 3 క్వింటాళ్లు వచ్చాయన్నారు. విత్తనాలను రాయితీపై రైతులుకు అందజేస్తామన్నారు.

ప్రజాసేవలు అందేనా..?



దూకలపాడు సచివాలయ భవనం

- నేటికీ తెరుచుకోని ప్రభుత్వ వెబ్ సైట్లు
- రేషన్‌కార్డు, పింఛన్, ఇతర సంక్షేమ పథకాల అర్హులకు తప్పని ఇబ్బందులు

నరసన్నపేట: గత ప్రభుత్వ కన్నా మెరుగైన పాలన అందిస్తామని, అర్హులకు సంక్షేమ పథకాలు సకాలంలో ఇస్తామని అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సచివాలయాల సేవలకు తూట్లు పొడుస్తోంది. ప్రజాసేవలకు కోతలు పెడుతోంది. ప్రజలకు అవసరమైన రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, రైతు భరోసా వంటి వెబ్‌సైట్లు ఇప్పటికీ ఓపెన్ కాలేదు. సచివాలయాల్లో ప్రజాసేవలను క్రమేనా తగ్గిస్తోంది. ప్రస్తుతం కేవలం ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, వన్–బీ వంటి సాధారణ సేవలు మాత్రమే అందుతున్నాయి. కార్డుల కోసం, పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే కుదరడం లేదు. కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకొనేందుకు లబ్ధిదారులు వచ్చి నిరాశతో వెనుదిరుగుతున్నారు.

నియోజకవర్గంలోని సచివాలయాల వివరాలు..	
మండలం	సచివాలయాలు
నరసన్నపేట	24
పోలాకి	23
జలుమూరు	24
సారవకోట	20

పింఛన్ కోసం ఎదురుచూపులు..

బీసీల్లో 50 ఏళ్ల వయస్సు నిండిన వారికి పింఛన్లను ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఎన్నికల కోడ్ అమలు అయ్యే సరికి అనేక మంది పింఛన్ కోసం దరఖాస్తు చేశారు. వారందరూ పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలైన తేదీన వెబ్‌సైట్లు మూతపడ్డాయి. ఎన్నికలు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం విజయం సాధించింది. ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలు పూర్తయ్యాయి. ఇప్పటికీ వెబ్‌సైట్లు తెరుచుకోవడం లేదు. ఎప్పుడు తెరుచుకుంటాయో అని అర్హులు ఆశగా ఎదురుచూస్తున్నారు. పథకాలు అందేది దేవుడు మాట. దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా ఎన్నాళ్లీ ఎదురు చూపులు అని ప్రశ్నిస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఇలా..

మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పల్లెల అభివృద్ధికి, అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు పెద్దపీట వేశారు. సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చారు. పథకాలు కావాలన్నా.. దరఖాస్తు చేసుకోవలన్నా మండల కేంద్రాలకు వెళ్లకుండా ఉన్న గ్రామాల్లోనే సచివాలయం ద్వారా సత్వర సేవలు అందించడానికి చర్యలు తీసుకున్నారు.

24 గంటలూ అవకాశం ఉండేది..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 60 ఏళ్లు దాటిన వారు వెంటనే సచివాలయంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి వీలు ఉండేది. రేషన్ కార్డు కొత్తగా కావాలన్నా, యూనిట్లు పెంచుకోవాలన్నా, ఇతర చేర్పులు, మార్పులకు 24 గంటలూ అవకాశం ఉండేది. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి వెబ్‌సైట్లు తెరవాలని కొత్తగా రేషన్ కార్డులు, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి వీలు కల్పించాలని అర్హులు కోరుతున్నారు.

ఇన్నాళ్ల జాప్యం తగదు



ఎన్నికలు పూర్తయి చాలా రోజులైంది. ఇన్నాళ్లు సచివాలయాల్లో వెబ్ సైట్లు ఓపెన్ కాకపోతే ఎలా?. సంక్షేమ పథకాలు మాట ఎలా ఉన్నా.. అర్హులు దరఖాస్తు చేసుకోవడానికి వీలు కల్పించాలి కదా?. ఇంకా ఎన్నాళ్లు ఎదురు చూడాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– మొజ్జాడ శ్యామ్, అల్లాడ, జలుమూరు మండలం

దరఖాస్తులకు అవకాశం ఇవ్వాలి



కొత్తగా పింఛన్ కావాలన్నా.. రేషన్ కార్డు కావాలన్నా వీలు కావడం లేదు. ఎందరో అర్హులు రేషన్ కార్డులు, వృద్ధులు పింఛన్లు పొందలేకపోతున్నారు. ఈ ప్రభుత్వం వెంటనే స్పందించాలి. గత ప్రభుత్వం మాదిరిగానే సచివాలయాల్లోనే దరఖాస్తు చేసుకోవడానికి వీలు కల్పించాలి. – పతివాడ గిరీశ్వరరావు, రాజీవ్‌నగర్ కాలనీ, నరసన్నపేట

జీడి పంటకు బీమా



మంగమ్మ, మండల ఉద్యాన అధికారి

పాతపట్నం: జీడి పంటకు వాతావరణ ఆధారిత బీమా పొందేందుకు రైతులందరూ ఎకరాకు రూ.1600 చొప్పున ప్రీమియం చెల్లించాలని మండల ఉద్యానశాఖ అధికారి ఎ.మంగమ్మ మంగళవారం తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల వల్ల తోటలకు నష్టం కలిగితే ఎకరాకు రూ.32 వేల వరకు బీమా పరిహారం అందుతుందని, హెక్టార్‌కు రూ.4 వేలు ప్రీమియం చెల్లిస్తే రూ.80 వేల వరకు బీమా పరిహారం అందుతుందన్నారు. రైతులు మీ–సేవ సెంటర్లలో బీమా ప్రీమియం చెల్లించాలని, వన్–బీ, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం, పంట సాగు పత్రం వివరాలతో ఈ నెల 15వ తేదీలోగా సీఎస్‌పీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని జీడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు సచివాలయంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు.

ప్రారంభానికి నోచుకోని భవనాలు



సచివాలయం



హెల్త్ క్లినిక్ సెంటర్

హిరమండలం: మండలంలోని మర్రిగూడ గిరిజన పంచాయతీ పరిధిలో నిర్మాణాలు పూర్తిచేసుకున్న సచివాలయం, హెల్త్ క్లినిక్ సెంటర్ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రంలో సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలను ఇప్పటికైనా అధికారులు స్పందించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కొత్తూరు: రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని స్థానిక ఎస్‌ఐ ఎం.ఎ.అహ్మద్ అన్నారు. కొత్తూరులోని పాలకొండ రోడ్డులో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలులేని వాహనదారుల నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. మద్యం సేవించి, ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం నేరమన్నారు. హెల్మెట్ విధిగా ధరించాలన్నారు.



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ అహ్మద్, సిబ్బంది

శిథిలావస్థ..



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని లొద్దలకాగాతాపల్లి వద్ద శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జీ. ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు పాడయ్యాయి. రాత్రి వేళల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. మండలంలోని సవళాపురం, అమృతలింగానగరం జంక్షన్ల వద్ద గల బ్రిడ్జీలు కూడా ప్రమాదభరితంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణీకులు భయాందోళన చెందుతున్నారు.

– సరుబుజ్జిలి

ప్రమాదకర మలుపు..



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలంలోని ఏబీ (అలికాం–బత్తిలి) ప్రధాన రహదారిలోని జంబాడు వద్ద ఉన్న మలుపు. హెచ్చరిక బోర్డులు లేకపోవటంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉన్న ఈ రోడ్డు మలుపు వద్ద తక్షణమే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణీకులు కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

పొంచి ఉన్న ప్రమాదం..



సారవకోట మండలంలోని మాకివలస నుంచి జలుమూరు మండలం శ్రీమన్నారాయణపురం వెళ్లే రహదారిలోని కోదడ్డపనస సమీపంలో వంశధార కాలువపై నిర్మించిన వంతెన రక్షణ గోడలు శిథిలావస్థలో ఉన్నాయి. ఇరువైపులా కొంత మేరకు రక్షణ గోడలు పడిపోయాయి. భారీ వాహనాలు వచ్చే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి రక్షణ గోడలను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– సారవకోట

నిరుపయోగం..



ఈ చిత్రం నరసన్నపేట పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న చెరువు గట్టు కాలనీ వద్ద అధ్వానంగా ఉన్న మంచి నీటి బోర్ వెల్ ప్లాట్ ఫాం. చాలా రోజులుగా బోరు నిరుపయోగంగా ఉన్నా.. పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ప్లాట్‌ఫాంను బాగుచేయాలని, పరిసరాలను పరిశుభ్రం చేయాలని కోరుతున్నారు.

– నరసన్నపేట

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

నాగుల చవితిని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి నువ్వులతో చేసిన చిమ్మి, కోడిగుడ్లను పుట్టలో వేసి, పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు బాగా పండాలని, నిత్యం పొలం పనులు చేసే రైతులు, రైతు కూలీలకు ఎలాంటి హాని తలపెట్టవద్దని నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. చవితి రోజున పంట పొలాలను సందర్శిస్తే మంచిదనే సంప్రదాయాన్ని రైతు కుటుంబాలు పాటించాయి.

– సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: నీలమణిదుర్గ ఆలయ ఆవరణలోని పుట్టవద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మెళియాపుట్టి: నాగదేవతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నరసన్నపేట: దేశవానిపేట బీసీ బాలికల వసతి గృహం విద్యార్థినులు ఇలా..



ఆమదాలవలస: ఇసుకలపేటలో..



హిరమండలం: నాగదేవతకు పూజలు చేస్తున్న భక్తులు



ఎల్.ఎన్.పేట: రావిచంద్రిలో ..



జలుమూరు: శ్రీముఖలింగంలో ..



సారవకోట: బుడితిలో ..



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో..

కలప అక్రమ రవాణా!

సరుబుజ్జిలి: మండలంలోని వెన్నెలవలస, అడ్డూరిపేట, అనంతగిరిపేట, మసానపుట్టి వంటి అటవీ ప్రాంతాల నుంచి అధికారుల అనుమతి లేకుండా టేకు, మద్ది, పాచి, అకేస్, గుగ్గిలం తదితర చెట్లను నరికివేస్తున్నారు. కలపను జలుమూరు, టెక్కలి, ఎల్.ఎన్.పేట, పాతపట్నం తదితర ప్రాంతాలకు రవాణా జరుగుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. కలప అక్రమ రవాణా జరగకుండా నియంత్రించాల్సిన ఫారెస్ట్ బీట్ అధికారులు, గార్డులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంలో ఆంతర్యమేమిటో అంతుచిక్కడంలేదని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



వెన్నెలవలస నుంచి అక్రమంగా తరలిస్తున్న కలప

గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

పాతపట్నం: మండలంలో గృహ నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తిచేయడానికి ప్రయత్నించాలని అధికారులకు మండల ప్రత్యేకాధికారి ఎం.కరుణాకరరావు ఆదేశించారు.

మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో లే అవుట్ స్పెషల్ ఆఫీసర్లతో గృహ నిర్మాణాలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న గృహాల పనులు వేగవంతం చేయాలన్నారు. డిసెంబర్ ఆఖరులోగా పూర్తిచేయాలన్నారు. ఎంపీడీఓ చంద్రకుమారి, హౌసింగ్ ఏఈ సీతారామరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి కరుణాకరరావు

నేడు ప్రజాదర్బార్

పాతపట్నం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజాదర్బార్ ఉంటుందన్నారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో మండల అధికారులందరూ పాల్గొంటారన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందినవారు సమస్యలపై వినతులు అందించవచ్చునని తహసీల్దార్ పేర్కొన్నారు.

ఇంటింటికీ సోలార్ పవర్

పొందూరు: కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న సోలార్ పవర్ (పీఎం సూర్య ఘర్)ను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. స్థానిక ఎర్రావారి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ పనిముట్లు కేంద్ర ప్రభుత్వం సహకారంతో అందించామన్నారు. ఇంటింటికీ సోలార్ పవర్‌ను ఉపయోగించడంతో విద్యుత్ ఖర్చు తగ్గుతుందన్నారు. చేనేత కార్మికుల ఆదాయం పెరిగేందుకు అవసరమైన శిక్షణలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని చేనేత, జౌళీశాఖ ఏడీ జనార్దనరావుకు సూచించారు. సర్పంచ్ రేగిడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

7న మండల సమావేశం

సరుబుజ్జిలి: ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎం.పావని మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సమావేశానికి పూర్తిస్థాయి సమాచారంతో అధికారులు హాజరుకావాలన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.